# అనుబంధం

ఏ. లక్ష్మీరమణ



దూరం నుండే వాడు ఆమెను గుర్తు పట్టేశాడు. ఎందుకు పట్టడు? వాడి జన్మలో అంత కన్నా మంచి మనసున్న అమ్మాయిని ఎరగడు. వాడి అమ్మ ఆ రోజుల్లో శాంతమ్మ తల్లి ఇంట్లోనేగా పనిచేసేది. అమ్మతో కూడా వెళ్లేవాడు. శాంతమ్మ ఎందుకో వాడి కళ్లల్లోకే చూస్తూ ఉన్నట్లు బాగా గుర్తు.

"మీ వాడికి చెంపకి చారెడేసి కళ్లు" అని అమ్మతో అనటం కూడా గుర్తు.

ఇంట్లో ఉదయం ఏ ఫలహారం చేసినా వాడి కడుపు నిండా పెట్టేది. ఇడ్లీలు ఎంత మెత్తగా దూదిలా ఉండేవి! ఉప్మాలో జీడిపప్పు మహా రుచిగా ఉండేది! దోశలు చేటల్లా ఉండేవి అరిటాకు నిండా నూనె కారుతుండేది! ఆ తరువాత ఎన్ని హోటళ్లలో తిన్నా ఆ రుచీ, ఆ తృప్తీ దొరకందే!

ఆ తరువాత నాన్న పోవటం, అమ్మ ఇల్లుమారి దూరంగా రావటం వల్ల మరింక ఆమెను చూడలేకపోయాడు. అయితేనేం? ఆమె రూపం అలాగే మనసులో ముద్ర వేసుకుని కూర్చుంది. నడుస్తూ వస్తున్న ఆమె వంకే చూస్తూ ఉండిపోయాడు. ఆమె దగ్గర పడుతోంది. ఎన్నేళ్లయినా, ఆమె ఎంత మారినా తాను గుర్తు పట్టగా లేంది ఆమె గుర్తు పట్టదా అన్న ధీమా! చేస్తున్న పని ఆపి ఆశగా, ఎంతో ఆశగా ఆమె వంకే చూస్తున్నాడు. ఆమె దగ్గరకు రానే వచ్చేసింది. తన వైపు చూసింది కూడా.

ఆమె చూసింది ఆ దిక్కు. ఒక్కసారిగా కడుపంతా తిప్పివేసి నట్లయింది. ఎవరో చేయిపట్టి పేగుల్ని తిప్పుతున్నట్లు అనిపించి వెగటు వచ్చింది. వాడి రూపం -'అబ్బా! ఎంత భయంకరంగా ఉంది' అనుకుంది. ఉరిమి చూస్తున్నట్లు ఆ కళ్లు, కండలు తిరిగిన ఆ మొరటు శరీరం, ఆ బొజ్జ, అన్నిటికన్నా వాడి చేతిలో ఉన్న భయంకరమైన ఆ కత్తి, పక్కనే వేలాడుతున్న వేట పోతులు, కొట్టిన మాంసపు ముక్కల కుప్పలు, విసిరేసిన తలలు, కాళ్లు, చుట్టూ ముసిరే ఈగలు, క్రింద పడి ఉన్న ఎముకలను పీక్కుతినే కుక్కలు, దుర్వాసన భరించలేక చెంగు ముందుకు లాక్కొని ముక్కు మూసుకుని అడుగులు గబగబా ముందుకు వేసింది. దాదాపు పరుగులా ఉంది ఆమె నడక.

ఆమె వెళ్లిపోయింది. వాడి గుండె జారిపోయినంత పనైంది. చుట్టూ ఈగల కన్నా ఎన్నో ఆలోచనలు వాడి మనసు నిండా మునురుకొన్నవి. తన మనసులో ముద్ర వేసుకున్న ఆ అన్నపూర్ణ తల్లి అలా మాయం కావటం వాడి మనసును పిండివేసింది. ఆ రోజంతా మనసు మనసులో లేదు. పని మీద మన సనలే లేదు. ఆమె పై రూపం ఎంత మారినా తాను గుర్తు పట్టేశాడే - మరి ఆమె తనని ఎందు కనలు గుర్తు



వట్టలేదు! అదే వాడిని వేధించేస్తున్న ప్రశ్న. అవును! ఆమె రూపురేఖలు బాగా మారిపోయినవి. అప్పుడు కళకళలాడే మొహంలో బొట్టు స్థానంలో విభూతి వెలవెల లాడుతూంది. నొసటిపైన ఎవరో గీసినట్లు లోతైన రేఖలు. తెల్లని చీర, రవిక. ఎక్కడా పోలిక లేదు. అయినా తన మనసులో పోలికలు మాసిపోలేదు. అందుకే ఆమెను ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా గుర్తు పట్టేయగలడు.

మరి తాను అంతగా మారిపోయానా ఏమిటని మథనపడ్డాడు. ఒకింత నవ్వు కూడా వచ్చింది. మారకపోవటం ఏమిటి - ఎనిమిదేళ్ల బాలుడికీ, ముప్పయి దాటిన మగాడికీ పోలిక ఎక్కడ! కొంచెం గట్టిగానే నవ్వుకున్నాడు. అసలు తన మీసాల సంగతి గుర్తుకు వచ్చి భుజాలు ఎగిరేలా నవ్వుకున్నాడు కూడా. "ఆ తల్లి ఎక్కడ గుర్తుపడుతుంది పాపం" అని మనసు నెమ్మది పరుచుకున్నాడు.

ఆ క్షణం నుండి వాడిలో అన్వేషణ మేలుకొంది. అన్నేళ్ల వెనుక చల్లని తల్లి ఉన్న ఇల్లు వెదుక్కుంటూ వెళ్ళా డొకనాడు. మనసు గతుక్కుమంది. ఆ ఇంట్లో ఇప్పు డామెలేదు. ఆ ఇల్లు కొన్న వాళ్లున్నారు. ఆరా తీయబోతే, తెలియదన్నారు. పోనీ బంధువు లెవరైనా దగ్గర ఉన్నారా అని వదలకుండా వేలాడాడు గుమ్మం ముంధు. వాళ్లు వినుక్కుంటూ 'రెండు వీధులు దాటాక ఫలానా వాళ్లు ఉన్నారని' చెప్పారు. తాను వెదుక్కుంటూ పోయాడు. ఆ ఫలానా వాళ్లని ప్రాధేయపడి అడిగాడు శాంతమ్మ గారి వివరాలు. ఫలానా చోట ఉందన్న కబురు రాబట్టుకున్నాడు ఎలా గయితేనేం. 'అమ్మయ్య బ్రతికాను' అని సంతోషపడిపోయాడు.

మరో నాడు కొట్టు కట్టేసి.మరీ బయలుదేరాడు. రెండు బస్సులు దాటి ఎలాగో ఒక లాగ ఇల్లు కనిపెట్టాడు.


అదో చిన్న ఇంటిలో ఒక భాగం. ముందు తులసి మొక్క. ఆమెకు తులసి చెట్టంటే ఎంతో ఇష్టం. వాడికి బాగా గుర్తు. మనసంతా సంబరంతో గంతులు వేసింది. తాను ఫలానా అని చెప్పెయ్యాలి అని ఆత్రంగా ఉంది మెల్లగా వెళ్లి తలుపు తట్టాడు. ఆ మె తలుపు తెరిచింది. వీడి మనసు విచ్చుకుంది. ఆమె కాళ్ల మీద పడబొయ్యాడు. ఆమె నిర్ఘాంతపోయి ఆ 'కటిక' వాడి వంక చూసింది. ఒక భయంకరమైన మృగాన్ని చూసి భయంతో అరవబోతున్నట్లు నోరు తెరిచింది. శబ్దం మాత్రం పెగలలేదు. ఒక్క క్షణంలో ధన్ను మంటూ తలుపు మూసుకుంది.

వీడి కాళ్ల కింద భూమి జరిగిపోయి నట్లనిపించింది. ఎంతో సేపు అట్లానే నిలుచుండిపోయాడు. చివరకు కాళ్లీడ్చుకుంటూ కొట్టుకు చేరుకున్నాడు. తన మీద తనకి ఎంతో కోపం వచ్చేసింది. తన ఒంటి మీద, తన వృత్తి మీద అన్నిటి మీదా కోపం ముంచుకు వచ్చింది.

ఇంక ఏం చెయ్యాలి! అదే వాడిని వేధించేస్తున్న ప్రశ్న! దహించి వేస్తున్న ప్రశ్న! దానికి సమాధానం ఎవరు చెబుతారు! వెళ్లి ప్రార్థన చేసుకు వచ్చాడు. మనసు కొంచెం కుదుటపడింది.

మెరుపులా ఓ తలపు మనసులో మెరిసింది. ఆరాలు మొదలుపెట్టాడు. ఆమె కంటపడకుండా, ఆమె బాగోగులన్నీ అక్కడ దగ్గరలో ఉన్న బంధువుని పట్టుకుని తెలుసుకుంటూ వచ్చాడు.

ఆరాలు బాగానే లాగాడు. ఆమె ఒంట్లో బొత్తిగా బాగుండటంలేదు. దగ్గర వా ళ్లెవరూ ఆమెను పట్టించుకోటంలేదు. ఆమె సాయం పొందిన వా ళ్లంతా అక్కర తీరాక దూరమయిపోయారు. ఒక్కతే బ్రతుకు భారంగా ఈడుస్తూ ఉంది. అండలేని బ్రతుకు. ఒక్కతే డాక్టరు దగ్గరకి వెళ్లడం, రావటం. ఎప్పటి వార్తలు అప్పుడు వీడికి అందుతూనే ఉన్నవి. వీడి బాబాయి ఆ దగ్గరలోనే ఉండటం, వల్ల వార్తలు ఎప్పటి కప్పుడు



అందుతున్నవి. ఏదన్నా అవసరం పడితే వెంటనే వచ్చి చెప్పమని డబ్బు కూడా ఇచ్చాడు బాబాయికి. బాబాయి మంచివాడు, డబ్బు తిన్నా మాట తప్పని మనిషి. అంతే చాలు మనవాడికి.

బాబాయి ఒకనాడు కొట్టుకు వచ్చాడు. శాంతమ్మ బాగా జబ్బు పడి ఆసుపత్రిలో చేరిందని చెప్పాడు. వీడికి మనసు కుంగిపోయింది. కొట్టు సంగతి కూడా పట్టించుకోకుండా పరుగెత్తాడు.

"ఏమిటో వీడి పిచ్చి" అనుకుంటూ ఆ బాబాయి కొట్టు మూసి వెనక బయలుదేరాడు.

ఆసుపత్రి చేరుకునే సరికి పొద్దు ఎక్కింది. డాక్టర్‌ని చూసే సరికి తలప్రాణం తోకకు వచ్చినంత పనైంది. చివరకి తెలుసుకున్నాడు ఆమెకు బాగా రక్తం తక్కు వయిందని, రక్తం ఎక్కించటానికి ప్రయత్నం చేస్తున్నారని. వీడు తొందర తొందరగా అడిగాడు తన రక్తం పరీక్ష చేసి చూడమని. నర్సులు కూడా వింతగా వీడి వంక అదోలా చూశారు, 'ఈ మొరటు వాడేమిటి పెద్ద మనసున్న వాడిలా ఈమె చుట్టూ తిరుగుతున్నాడు" అన్నట్లున్నది వాళ్ల చూపులు. అసలు వాళ్ల కేం తెలుసు ఆ తల్లి మనస్సు! ఎవరికి చీమకుట్టినా ఓర్చుకోలేకపోయేది. ఎప్పుడూ ఎవరికో ఒకరికి సాయం చెయ్యటంలోనే జీవిత మంతా వెళ్లమారింది.

అసలు తను ఆమెకు ఏమీ కాడు. అయినా తిండీ తిప్పలు చూడటంతో ఆగేదా - చెవిపోటంటే పసరు పోసేది, కడుపు నొప్పంటే వాము, తేనె కలిపి ఇచ్చేది. జ్వరం వస్తే దగ్గ రుండి డాక్టరుకు చూపించేది. కడుపు కాలితే అన్నం, బట్ట చినిగితే చొక్కా.ఒ వాడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇన్ని చేసిన ఆమె ఒక్క రోజు రొంప పట్టి పడుకుని ఎరగదు. అసలు అనారోగ్యం ఆమెను చూస్తేనే ఆమడదూరం పరిగెత్తుకుపోతుంది అన్నట్లుండేది. అటువంటి ఆమె మంచానికి అతుక్కుపోతే, చుట్టూ చూసే దిక్కులేకపోతే రాయయినా కరుగుతుందా, మరీ వీళ్లందరికీ తను రాయికన్నా కఠినంగా కనిపిస్తున్నట్లుంది... ఆ" అని కోపంగా అనుకున్నాడు.

ఎలాగో ఓ చిన్న డాక్టరును మంచి చేసుకున్నాడు. ఆ డాక్టరు బాబు తన దగ్గరే రోజూ కూర పట్టుకెళ్లేది కనుక కొంచెం ఎరుకలో ఉన్న పెద్ద మనిషి. అతడ్ని పట్టుకొని మరి వదల్లేదు. పని జరిగింది. తన రక్తం కూడా 'ఓ ప్లస్' అన్నారు. రక్తం బాగుంది, ఎక్కించేశారు.

కొన్నాళ్లకి ఆమె తేరుకుంది. జూనియర్ డాక్టర్ ఒక రోజు ఆమెతో అసలు విషయం వివరించాడు. ఆమె కళ్లు పర్శించాయి. తనకి కూడా ఒక్క అప్పుడు మిగిలాడు - ఆ తలపు మనసంతా ఆనందంతో నింపివేసింది. వాడు ఆమె నిద్రపోతున్నప్పుడు తప్ప ఎదట పడటానికి భయపడి చస్తున్నాడు. ఎందుకో కొట్టు కట్టేసి బాబాయికి అప్పచెప్పేశాడు. అందాకా చేసుకున్న డబ్బుతో కిళ్లీ దుకాణం, అందులోనే పిల్లల బిళ్లలు, చాక్లెట్లు వగైరా పెట్టుకున్నాడు. బెంగతో, తిరుగుడుతో చిన్న బొజ్జ కాస్తా కరిగింది, బాగా చిక్కాడు కూడా.

ఆమెకు తిరిగి బాగా తెలివి వచ్చి వాడిని చూడాలని పట్టుపట్టింది. అది విని వాడికి దేవతే దిగి వచ్చి వరం ఇవ్వటానికి రమ్మని కబురు పెట్టినంత సంబరంగా ఉంది. స్నానం చేసి, ఉతికిన బట్టలు కట్టుకున్నాడు. 'అమ్మ వారిని చూడటానికి వెళితే శుచిగా వెళ్లాలి కదా మరి' అనుకున్నాడు, మనసు లేగదూడలా గంతులు వేస్తుంది.

బెరుకు బెరుగ్గా అడుగులు వేస్తూ లోపలికి వెళ్లాడు. ఆమె ఇటు తిరిగి వాడి వంక తేరిపార చూసింది. సాక్షాత్తు అన్నపూర్ణమ్మ చల్లని చూపులు తనపైన నిలిచి నట్లే ఉంది. ఆమె తనను తాను బాగా మందలించుకుంది. ఇంత చేసి వాడి పైపై మొరటు రూపం చూసిందే కానీ మొహం పట్టుకుని చూడనేలేదు. వాడి కళ్ల వంక అసలు కళ్లెత్తి చూస్తేగా గుర్తు పట్టటానికి! వాడి కళ్లు మారనే లేదు. ఎనిమిదేళ్ల ఆ పసివాడి కళ్లే. చెంపకు చేరడేసి అమాయకంగా చూసే ఆ కళ్లు. త న్నెందుకు గుర్తు పట్టలేదు! ఆమె కళ్లు చెమ్మ గిల్లాయి. నోరు మెదిపి పలకరించింది. అది చచ్చిపోయిన అమ్మ పలకరింపు, మరిచిపోయిన చల్లని తల్లి పలకరింపు, దిగి వచ్చిన దేవత పలకరింపులా చల్లగా, హాయిగా వాడి చెవున పడింది. ఆ పలకరింపులోఎంత తియ్యదనం!